నర్సింగ్ బదిలీల్లో రచ్చ

మొదటిపేజీ తరువాయి...

నిర్వహించారు. డీపీహెచ్ కార్యాలయ ముట్టడికి ప్రయత్నించగా పోలీసులు అడ్డుకున్నారు. దీంతో రోడ్డుపైనే నిరసన తెలిపారు. 'హెల్త్ మినిస్టర్ రావాలి'.. 'మాకు న్యాయం చేయాలి' అంటూ నినాదాలు చేశారు. లాంగ్ స్టాండింగ్ జాబితా నుంచి పలువురి పేర్లు మాయమయ్యాయని, అర్హత లేని, బయటి సంఘాల నుంచి వచ్చిన సిఫారసు లేఖలను తీసుకొని కొందరిని రిటెయిన్ చేశారని, ఒక్కో బదిలీకి రూ. లక్షల్లో డబ్బులు చేతులు మారాయని ఆరోపించారు. రాత్రి వరకు నర్సుల ఆందోళన కొనసాగింది. దీంతో భారీగా ట్రాఫిక్ జామ్ అయ్యింది. నర్సులకు సర్దిచెప్పేందుకు డీపీహెచ్ రవీంద్రనాయక్ మెడికల్ కాలేజీకి రాగా.. నర్సులు ఆయనను ఘెరావ్ చేసి నిలదీశారు. తమకు న్యాయం చేసేవరకు కౌన్సెలింగ్ నిర్వహించొద్దంటూ వాదించారు.

కోఠిలోని ఉస్మానియా మెడికల్ కాలేజ్ ఎదుట ధర్నా నిర్వహిస్తున్న స్టాఫ్ నర్సులు

సీనియార్టీ లిస్టుల్లో తప్పులతో మొదలు..

డీపీహెచ్ పరిధిలో స్టాఫ్ నర్సుల బదిలీల కోసం ఉస్మానియా మెడికల్ కాలేజీలో శుక్రవారం కౌన్సెలింగ్ ఏర్పాటు చేశారు. సీనియర్, జూనియర్ నర్సింగ్ ఆఫీసర్లు రెండు వేల మంది వరకు వచ్చారు. సీనియార్టీ లిస్టును ముందుగానే ప్రకటించాల్సి ఉండగా, గురువారం రాత్రి ప్రకటించారు. దీంతో శుక్రవారం కౌన్సెలింగ్‌కు వచ్చిన తర్వాత తప్పులు ఉన్నట్టు నర్సులు గుర్తించారు. వాటిని సవరించిన తర్వాతే కౌన్సెలింగ్ చేయాలంటూ ఆందోళన ప్రారంభించారు. దీంతో కౌన్సెలింగ్‌ను వాయిదా వేస్తామని, ఆన్‌లైన్‌లో నిర్వహిస్తామని అధికారులు ప్రకటించడంతో నర్సులు ఆగ్రహం వ్యక్తం చేస్తూ రోడ్డుపైకి వచ్చారు.

'రాజకీయ' సిఫారసు లేఖలతో రచ్చ

లాంగ్ స్టాండింగ్ జాబితా నుంచి 40 మంది స్టాఫ్ నర్సుల పేర్లు మాయమయ్యాయని నర్సులు పేర్కొన్నారు. కౌన్సెలింగ్ జరుగుతున్న సమయంలోనే.. సంఘాల నాయకులమని చెప్పుకొనే ఇద్దరు ముగ్గురు లీడర్లు వచ్చి, పదుల సంఖ్య లో లేఖలు అధికారులకు ఇచ్చి, అందరినీ రిటెయిన్ చేయాలని సూచించారని తెలిపారు. సిఫారసు లేఖల్లో ఉన్న పేర్లన్నీ ఉస్మానియా, గాంధీ, నిలోఫర్, మెటర్నిటీలో పనిచేస్తున్నవారే ఉన్నట్టు తెలిసింది. వీరంతా దశాబ్దాలుగా అక్కడే పాతుకుపోయారని ఆరోపణలున్నాయి. లీడర్లు ఆ లేఖలకు డబ్బులు వసూలు చేశారని, వైద్యారోగ్య శాఖలోని ఓ కీలక అధికారికి భారీగా ముట్టజెప్పి లిస్టులో నుంచి తమ పేర్లను తీసేయించుకున్నారని ఆరోపించారు. లిస్ట్ నుంచి పేర్లు మాయం కావడంపై ఆగ్రహం వ్యక్తం చేస్తూ నిరసన ప్రారంభించారు.

డీపీహెచ్ ఘెరావ్

ఆందోళనలను శాంతింపజేయడానికి డీపీహెచ్ రవీంద్ర నాయక్ ఉస్మానియా మెడికల్ కాలేజీకి వచ్చారు. ఆయన నర్సులతో మాట్లాడేందుకు ప్రయత్నించగా, అందరూ ఆయనను చుట్టుముట్టారు. కౌన్సెలింగ్ ఆపాలని, సీనియార్టీ లిస్టు, వేకెన్సీ లిస్టు ప్రకటించాలని, పారదర్శకంగా నర్సుల బదిలీలు జరిగేలా ఆదేశించాలని డిమాండ్ చేశారు. దీంతో చేసేదేమీ లేక డీపీహెచ్ తిరిగి వెళ్లిపోయారు.

రాత్రివేళ కోఠి రోడ్డుపై నిరసన

కౌన్సెలింగ్ నిర్వహిస్తామంటూ పొద్దంతా కాలయాపన చేసిన అధికారులు.. చీకటిపడే సమయంలో 'కౌన్సెలింగ్‌ను వాయిదా వేస్తున్నాం' అంటూ ప్రకటించారు. దీంతో నర్సులు ఆగ్రహం వ్యక్తం చేశారు. మెడికల్ కాలేజీ ముందు కోఠి ప్రధాన రహదారిని దిగ్బంధించారు. ఆప్షన్లు ఇవ్వకుండా, ఆన్‌లైన్ కౌన్సెలింగ్ నిర్వహిస్తే సహించేది లేదని హెచ్చరించారు. ఉద్యోగుల సాధారణ బదిలీలను ప్రకటించిన ప్పటి నుంచీ డీపీహెచ్ పరిధిలో సీనియార్టీ జాబితాపై ఆందోళనలు జరుగుతూనే ఉన్నాయి. నర్సుల ఆందోళనతో మూడుసార్లు జాబితాను సవరించారు.

ప్రమాద రహిత సంస్థగా సింగరేణి

- గనుల్లో భద్రత పెంపుదలకు పటిష్టమైన చర్యలు
- రక్షణ త్రైపాక్షిక సమావేశంలో సీఎండీ ఎన్ బలరాం

హైదరాబాద్, జూలై 19 (నమస్తే తెలంగాణ): గనుల్లో భద్రత పెంపుదలకు పటిష్టమైన చర్యలు తీసుకుంటామని, కార్మిక సంఘాలు చేసిన సూచనలనూ పరిగణలోకి తీసుకుంటామని సింగరేణి సంస్థ సీఎండీ ఎన్ బలరాం ప్రకటించారు. హైదరాబాద్ సింగరేణి భవన్‌లో శుక్రవారం గుర్తింపు కార్మిక సంఘం జనరల్ సెక్రటరీ వి. సీతారామయ్య అధ్యక్షతన జరిగిన 48వ రక్షణ త్రైపాక్షిక సమీక్ష సమావేశంలో ఆయన ప్రసంగించారు. సింగరేణి సంస్థ ఉత్పత్తిలో ఆదర్శప్రాయంగా ఉందని, రక్షణలోనూ ప్రమాద రహిత కంపెనీగా రూపుదిద్దాల్సిన బాధ్యత అందరిపై ఉందని బలరాం అన్నారు. ఈ కార్యక్రమంలో ఐఎన్‌టీయూసీ సెక్రటరీ జనరల్ జనక్ ప్రసాద్, డైరెక్టర్ ఆఫ్ మైన్స్ సేఫ్టీ రీజియన్ 2 ఎన్ నాగేశ్వరరావు, సంస్థ డైరెక్టర్లు డీ సత్యనారాయణ (ఈ అండ్ఎం) ఎన్వీ కే శ్రీనివాస్ (ఆపరేషన్స్ అండ్ పర్సనల్), జీ వెంకటేశ్వర్ రెడ్డి (ప్లానింగ్ అండ్ ప్రాజెక్ట్స్) రక్షణ చర్యలపై ప్రసంగించారు.

అసభ్య ప్రవర్తన.. మహిళల దాడిలో యువకుడి మృతి

శంషాబాద్ రూరల్, జూలై 19: ఓ యువకుడి అసభ్య ప్రవర్తనకు విసిగి వేసారిన మహిళలు అతడిని చెట్టుకు కట్టేసి కొట్టారు. ఆ దెబ్బలకు తాళలేక ఆ యువకుడు మృతిచెందాడు. రంగారెడ్డి జిల్లా శంషాబాద్‌లో ఘటన చోటుచేసుకున్నది. పట్టణంలోని ప్రశాశ్‌నగర్ కాలనీకి చెందిన రాచమల్ల కుమార్ (30) జులాయిగా తిరుగుతూ ఒంటరిగా ఉన్న మహిళల వద్దకు వెళ్లి ఒంటిపై ఉన్న బట్టలు విప్పి అసభ్యకరంగా ప్రవర్తించేవాడు. పలుమార్లు కాలనీ పెద్దల దృష్టికి తీసుకెళ్లినా, అతడిలో మార్పు రాలేదు. బుధవారం కాలనీ మహిళలతో అసభ్యకరంగా ప్రవర్తించి, దుర్భాషలాడాడు. దీంతో మహిళలు అతడిని చెట్టుకు కట్టేసి కొట్టారు. దెబ్బలు భరించలేక అతను మృతి చెందాడు. యువకుడి మృతికి కారణమైన కృష్ణవేణి, సంగీత, మహేశ్వరి, చంద్రకళను పోలీసులు అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు.

రిజిస్ట్రేషన్లు ఎలా తిరస్కరిస్తారు?

- తిరస్కరణలు రాతపూర్వకంగా ఉండాల్సిందే
- మార్గదర్శకాలు జారీ చేసిన హైకోర్టు

హైదరాబాద్, జూలై 19 (నమస్తే తెలంగాణ): ప్రభుత్వ ఉత్తర్వులు, నోటిఫికేషన్ల ద్వారా తలెత్తిన వివాదాలు పరిష్కారమైనప్పటికీ కోర్టు ఉత్తర్వులు తీసుకురావాలంటూ సబ్ రిజిస్ట్రార్‌లు రిజిస్ట్రేషన్లను తిరస్కరిస్తుండటంపై హైకోర్టు మండిపడింది. కీలక మార్గదర్శకాలు జారీచేసింది. నిషేధిత జాబితాలోని ఆస్తుల రిజిస్ట్రేషన్ వ్యవహారాల్లో సబ్ రిజిస్ట్రార్‌లు తమ స్థాయిలో నిర్ణయం తీసుకోవడానికి అధికారాలు ఉన్నప్పటికీ, మౌఖికంగా తిరస్కరిస్తున్నారని ఆక్షేపించింది. ఫలితంగా పలువురు కోర్టుకు రావాల్సివస్తున్నదని, వచ్చాక తాము తిరస్కరించలేదని సబ్ రిజిస్ట్రార్‌లు చెబుతున్నారని పేర్కొంది. ప్రజలు కూడా రిజిస్ట్రేషన్ కార్యాలయానికి వెళ్లకుండానే వివాదాస్పద స్థలాల వ్యవహారంలో కోర్టు ఉత్తర్వులు తీసుకెళ్లే ప్రయత్నాలు చేస్తున్నారని తెలిపింది. కోర్టు వివాదం పరిష్కారమైనా కోర్టు ఉత్తర్వులు తీసుకురావాలంటూ పెద్దఅంబర్‌పేట సబ్ రిజిస్ట్రార్ రిజిస్ట్రేషన్‌ను తిరస్కరించడాన్ని సవాలు చేస్తూ రంగారెడ్డి జిల్లా అబ్దుల్లాపూర్‌మెట్‌కు చెందిన రామేశ్వరీదేవి వేర్వేరుగా 24 పిటిషన్‌లు దాఖలు చేశారు. వీటిపై జస్టిస్ ఎన్‌వీ శ్రవణ్‌కుమార్ విచారణ జరిపారు.

కోర్టులకు జోక్యం చేసుకొనే అధికారం

కోర్టు ఉత్తర్వులు తీసుకురావాలంటూ రిజిస్ట్రేషన్లను తిరస్కరిస్తున్నారని జస్టిస్ శ్రవణ్‌కుమార్ ఆందోళన వ్యక్తంచేశారు. అందువల్ల ప్రజల హక్కులకు సంబంధించి తగిన మార్గదర్శకాలు చేస్తున్నామన్నారు. పట్టణాల్లో ఫ్లాట్‌లు, యూనిట్‌లు ఒక్కోసారి మొత్తం ప్రాపర్టీని నిషేధిత జాబితాలో ఉంచుతున్నారని, ఈ చర్యలు ప్రజలకు రాజ్యాంగం కల్పించిన 300ఏ హక్కుకు భంగం కలిగిస్తున్నాయని అన్నారు. రిజిస్ట్రేషన్‌లో పారదర్శకత కోసం మార్గదర్శకాలు ఇస్తున్నామని చెప్పారు.

మార్గదర్శకాలు..

రిజిస్ట్రేషన్ చట్టం ప్రకారం వారంలోగా పత్రాలను రిజిస్ట్రేషన్ చేయాలని, లేదంటే తిరస్కరించాలని న్యాయమూర్తి పేర్కొన్నారు. కోర్టు ఉత్తర్వులు తీసుకురావాలని డిమాండ్ చేయరాదంటూ సబ్ రిజిస్ట్రార్లకు ఉన్నతాధికారులు సర్క్యులర్‌లు జారీ చేయాలని ఆదేశించారు. రిజిస్ట్రేషన్‌ను తిరస్కరించినట్లయితే అప్పటికే చెల్లించిన స్టాంపు డ్యూటీ, రిజిస్ట్రేషన్ ఫీజులను వాపసు చేయడానికి సులువైన విధానాన్ని అమలు చేయాలి. ప్రతి సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో రిజిస్టర్/జనరల్ డైరీ (జీడీ బుక్/ఎంట్రీబుక్/రిజిస్టర్)ను నిర్వహించాలి. నిషేధిత భూములకు చెందిన సెక్షన్ 22ఏను సమర్థిస్తూ విజయమురి రాజగోపాలాచారి వర్సెస్ ఏపీ, ఇన్వెక్టా టెక్నాలజీస్ ప్రైవేట్ లిమిటెడ్ వర్సెస్ ఏపీ కేసుల్లో ఇచ్చిన తీర్పులను రిజిస్ట్రేషన్ అధికారులు అమలు చేయాలి. కోర్టు ఉత్తర్వుల కోసం పట్టుబట్టకుండా అధికారం ఉన్న సబ్ రిజిస్ట్రార్ /ఎమ్మార్వోలు ఉత్తర్వులు జారీ చేయాలి.

ఆర్టీసీ అధికారులమని బెదిరించి లారీ చోరీ

- 120 పసుపు బస్తాలు అపహరణ

వినాయకనగర్/నవీపేట, జూలై 19: సూర్యపేట జిల్లా కోదాడవాసి వెంకటేశ్వరరావుకు చెందిన లారీ సిమెంట్‌లోడ్‌తో గురువారం నిజామాబాద్‌కు వచ్చింది. తిరుగు ప్రయాణంలో 30 టన్నుల పసుపు బస్తాలతో డ్రైవర్ రమేశ్ గుంటూరుకు బయల్దేరాడు. ఇందల్వాయి టోల్ ప్లాజా వద్దకు రాగానే కారులో వచ్చిన ఇద్దరు అగంతకులు ఆర్టీఏ అధికారులమని బెదిరించి, లారీతో సహా అక్కడి నుంచి పరారయ్యారు. నాలుగు వ్యాన్లలో 120 పసుపు బస్తాలను నవీపేటలోని ఓ గదిలో డంప్ చేశారు. జీపీఎస్ ఆధారంగా జన్నేపల్లిలో లారీ ఉన్నట్టు తెలుసుకున్న పోలీసులు లారీని, నవీపేటలో పసుపు బస్తాలను స్వాధీనం చేసుకున్నారు. నవీపేటకు చెందిన ఓ వ్యాపారిని అదుపులోకి తీసుకుని విచారిస్తున్నట్టు తెలిసింది.



హత్యకు గురైన వైసీపీ కార్యకర్త రషీద్ కుటుంబాన్ని పరామర్శిస్తున్న జగన్

ఏపీలో అరాచక పాలన

- 45 రోజుల్లో 36 హత్యలు
- 300కు పైగా హత్యాయత్నాలు
- లోకేశ్ రెడ్‌బుక్ ప్రకారమే ఇదంతా
- దీనిని దేశం దృష్టికి తీసుకెళ్తాం
- ప్రధానిని కలిసి వివరిస్తాం
- 24న ఢిల్లీలో ధర్నా చేస్తాం
- రాష్ట్రపతి పాలన కోరుతాం
- ఏపీ మాజీ సీఎం జగన్

హైదరాబాద్, జూలై 19 (నమస్తే తెలంగాణ) : ఆంధ్రప్రదేశ్‌లో అరాచక పాలన కొనసాగుతున్నదని, నీచ సంస్కృతి రాజ్యమేలుతున్నదని వైసీపీ అధినేత, మాజీ సీఎం జగన్మోహన్‌రెడ్డి ఆందోళన వ్యక్తంచేశారు. దీనిని దేశం దృష్టికి తీసుకెళ్లాల్సిన అవసరం ఉన్నదని, అందుకే రాష్ట్రంలో జరుగుతున్న దాడులపై ప్రధాని మోదీని కలిసి వివరిస్తామని చెప్పారు. ఇక్కడ నెలకొన్న పరిస్థితులను నిరసిస్తూ ఢిల్లీలో ధర్నా చేస్తామని, రాష్ట్రపతి పాలన పెట్టాలని డిమాండ్ చేస్తామని తెలిపారు. పల్నాడు జిల్లా వినుకొండలో హత్యకు గురైన వైసీపీ కార్యకర్త రషీద్ కుటుంబాన్ని జగన్ శుక్రవారం పరామర్శించారు. అనంతరం మీడియాతో మాట్లాడుతూ ఆంధ్రప్రదేశ్‌లో శాంతిభద్రతలు క్షీణించాయని, హత్యారాజకీయాలు పెరిగిపోయాలని ఆవేదన వ్యక్తంచేశారు. వైఎస్సార్సీపీ ఎంపీ, ఎమ్మెల్యేలపైనా దాడి చేశారని చెప్పారు. మిథున్ రెడ్డి, రెడ్డప్పపై దాడి చేసి వాళ్లపైనే మర్డర్ కేసు పెట్టారని వాపోయారు. గత ఐదేండ్లలో ఎన్నడూ ఇలాంటి ఘటనలు జరగలేదని చెప్పారు. లోకేశ్ రెడ్‌బుక్ ప్రకారమే ఇదంతా జరుగుతున్నదని విమర్శించారు. దాడులపై కేంద్ర ప్రభుత్వం దర్యాప్తు చేయాలని డిమాండ్ చేశారు. త్వరలో జరిగే అసెంబ్లీ సమావేశాల్లో నిరసన తెలుపుతామని, అసెంబ్లీలో గవర్నర్ ప్రసంగాన్ని అడ్డుకుంటామని హెచ్చరించారు. ఏపీలో పోలీసులు ప్రేక్షకపాత్రకే పరిమితమయ్యారని జగన్ ఆగ్రహం వ్యక్తంచేశారు. అండగా నిలవాల్సిన పోలీసులే బాధితులపై కేసులు పెడుతున్నారని ఆరోపించారు. ఏపీలో పాలన ఆటవిక రాజ్యాన్ని తలపిస్తున్నదని, 45 రోజుల పాలనలోనే 36 హత్యలు, 300కు పైగా హత్యాయత్నాలు జరిగాయని, 560 ప్రాంతాల్లో ప్రైవేట్ ఆస్తులు ధ్వంసమయ్యాయని, వైసీపీ సానుభూతిపరుల ఆస్తులను ధ్వంసం చేస్తున్నారని, 490 ప్రాంతాల్లో ప్రభుత్వ ఆస్తులను ధ్వంసం చేశారని, వెయ్యికిపైగా దౌర్జన్యాలు, దాడులు జరిగాయని ఆవేదన వ్యక్తంచేశారు. ఈనెల 24న రాజ్యసభ, లోక్‌సభ, శాసనసభ, శాసన మండలి సభ్యులతో కలిసి ఢిల్లీలో శాంతియుతంగా ధర్నా చేస్తామని వెల్లడించారు. ఏపీలో రాష్ట్రపతి పాలన పెట్టాలని డిమాండ్ చేస్తామని చెప్పారు. వచ్చే బుధవారం ఢిల్లీలో జగన్ నేతృత్వంలో ధర్నా జరుగుతుందని, ఇందులో వైసీపీ ఎమ్మెల్యేలు, ఎంపీలు, ఎమ్మెల్సీలు పాలొంటారని వైఎస్సార్సీపీ ప్రకటించింది. ఏపీలో అసెంబ్లీ ఎన్నికల తర్వాత జరిగిన హత్యలు, లైంగికదాడులు, దాడులపై నారా లోకేశ్ శ్వేతపత్రం ఇవ్వాలని వైసీపీ ఎంపీ విజయసాయిరెడ్డి శుక్రవారం ఎక్స్ వేదికగా డిమాండ్ చేశారు.

పోలీసుల డీపీలతో 'సైబర్' కాల్స్!

హైదరాబాద్, జూలై 19 (నమస్తే తెలంగాణ) : సైబర్ నేరగాళ్లు పోలీసుల ఫొటోలు డీపీలుగా పెట్టుకొని కాల్స్ చేస్తున్నారు. వీరితో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని డీజీపీ జితేందర్ ఎక్స్ వేదికగా ప్రజలను కోరారు. అపరిచితులు కాల్ చేసి.. డ్రగ్స్, హత్య, రేప్ కేసులోనో మీ వాళ్లను అరెస్టు చేశామని నకిలీ వ్యక్తులతో మాట్లాడించి బురిడీ కొట్టిస్తారు. అలాంటి కాల్స్‌తో జాగ్రత్తగా ఉండాలని సూచించారు.

చిత్రం

అంతర్జాతీయ వేడుకకు అతిథిగా..

'ప్రతిష్టాత్మకమైన ది ఇండియన్ ఫిల్మ్ ఫెస్టివల్ ఆఫ్ మెల్‌బోర్న్(IFFM)లో భాగం కావడం నటుడిగా నాకు దక్కిన పెద్ద గౌరవం. ఈ వేదికపై భారతీయ సినిమా తరపున ప్రాతినిధ్యం వహిస్తున్నందుకు గర్వంగా ఉంది. ప్రపంచవ్యాప్తంగా ఉన్న అభిమానులతో, సినీ ప్రముఖులతో కనెక్ట్ కావడం మరింత ఉత్సాహాన్నిస్తోంది' అంటూ రామ్‌చరణ్ ఆనందం వ్యక్తం చేశారు. ఆస్ట్రేలియా మెల్‌బోర్న్‌లో అత్యంత ప్రతిష్టాత్మకమైన ది ఇండియన్ ఫిల్మ్ ఫెస్టివల్ ఆఫ్ మెల్‌బోర్న్(IFFM) వేడుకలు ఈ ఏడాది ఆగస్ట్ 15 నుంచి 25 వరకూ ఘనంగా జరుగనున్నాయి. ఇది ఆస్ట్రేలియాలోని విక్టోరియన్ రాష్ట్ర ప్రభుత్వం ప్రతి ఏటా నిర్వహించే అధికారిక చలన చిత్రోత్సవం. ఈ వేడుకకు చెందిన IFFM 15 ఎడిషన్‌కు గౌరవ అతిథిగా రామ్‌చరణ్ హాజరు కానున్నారు. అంతేకాక, 'గెస్ట్ ఆఫ్ హానర్' అవార్డును కూడా అందుకోనున్నారు. ఈ సందర్భంగా రామ్‌చరణ్ ఇంకా మాట్లాడుతూ 'ఆర్ఆర్ఆర్ సినిమా ప్రపంచవ్యాప్తంగా ఎంతటి విజయాన్ని దక్కించుకుందో తెలిసిందే. మెల్‌బోర్న్‌లో ఆ సినిమాకు సంబంధించిన అనుభవాలను ప్రేక్షకులతో పంచుకోబోతుండటం ఊహించుకుంటేనే చెప్పలేని ఆనందాన్నిస్తోంది. అలాగే మెల్‌బోర్న్‌లో మన జాతీయ జెండాను ఎగురవేసే అద్భుతమైన క్షణాలకోసం ఎదురుచూస్తున్నాను' అని రామ్‌చరణ్ అన్నారు. 'ఆర్ఆర్ఆర్' సినిమా ద్వారా ప్రపంచవ్యాప్తంగా గుర్తింపు సాధించిన రామ్‌చరణ్ IFFM వేడుకల్లో పాల్గొనబోతుండటం తనకెంతో గర్వకారమని IFFM డైరెక్టర్ మితు బౌమిక్‌లాండ్ అన్నారు.

ఆగస్ట్‌లో ఆగమనం

విక్రమ్ కథానాయకుడిగా నటిస్తున్న పీరియాడిక్ చిత్రం 'తంగలాన్'. కోలార్ గోల్డ్‌ఫీల్డ్స్ నేపథ్య కథాంశమిది. ఈ సినిమాలో బంగారు గనుల్లో పని చేసే ఓ తెగకు సంబంధించిన నాయకుడిగా విక్రమ్ పవర్‌ఫుల్ పాత్రలో కనిపించనున్నారు. ఈ చిత్రాన్ని ఆగస్ట్ 15న విడుదల చేస్తున్నట్లు మేకర్స్ ప్రకటించారు. యథార్థ ఘటనల ఆధారంగా రూపొందించిన ఈ చిత్రం ప్రేక్షకులకు సరికొత్త అనుభూతినందిస్తుందని, ఇప్పటికే విడుదల చేసిన ట్రైలర్, ప్రచార చిత్రాలకు అద్భుతమైన స్పందన లభించిందని చిత్ర బృందం పేర్కొంది. మాళవిక మోహనన్, పార్వతీ తిరువోతు తదితరులు నటిస్తున్న ఈ చిత్రానికి పా.రంజిత్ దర్శకత్వం వహిస్తున్నారు. కేఈ జ్ఞానవేల్ రాజా నిర్మాత.

చిత్రీకరణ చివరిదశకు?

మెగా అభిమానులు ఎప్పుడెప్పుడా అని ఆసక్తిగా ఎదురుచూస్తున్న సినిమా 'విశ్వంభర'. పూర్తిస్థాయి సోషియో ఫాంటసీ కథాంశంతో తెరకెక్కుతున్న ఈ చిత్రంలో చిరంజీవి మునుపెన్నడూ చూడని వైవిధ్యమైన పాత్రలో నటిస్తున్నారు. మల్లిడి వశిష్ఠ రూపొందిస్తున్న ఈ సినిమా షూటింగ్ శరవేగంగా జరుగుతున్నది. ఇదిలావుంటే ఈ సినిమాకు సంబంధించిన టాకీ పార్ట్ దాదాపు పూర్తి కావొచ్చిందని సమాచారం. కొన్ని పాటలు, పతాక సన్నివేశాలకు సంబంధించి భారీ ఫైట్ మాత్రమే ఇక మిగిలివున్నాయని ఫిల్మ్‌వర్గాల వినికిడి. ఈ సినిమాకు సంబంధించిన సాలిడ్ టీజర్‌ని కూడా మేకర్స్ రెడీ చేస్తున్నారట. చిరంజీవి పుట్టినరోజైన ఆగస్ట్ 22న ఈ టీజర్‌ని విడుదల చేయనున్నారు. ఇందులోని వీఎఫ్ఎక్స్ థ్రిల్ కలిగిస్తాయని, ఎం.ఎం.కీరవాణి స్వరాలు సినిమాకు ప్రత్యేక ఆకర్షణగా నిలువనున్నాయని మేకర్స్ చెబుతున్నారు. యూవీ క్రియేషన్స్ అత్యంత ప్రతిష్టాత్మకంగా నిర్మిస్తున్న ఈ చిత్రంలో త్రిష కథానాయికగా నటిస్తున్న విషయం తెలిసిందే. సంక్రాంతి కానుకగా వచ్చే ఏడాది జనవరి 10న సినిమా విడుదల కానుంది.

బాలీవుడ్ వైపు నడిపించింది అదే!

'లైగర్'తో తెలుగు ప్రేక్షకులను పలకరించిన బాలీవుడ్ భామ అనన్యపాండే. ప్రస్తుతం ఈ స్టార్‌కిడ్‌కి బాలీవుడ్ అవకాశాలకు కొదవలేదు. త్వరలో 'కాలీ మీ బే' అనే వెబ్‌సిరీస్‌తో ప్రేక్షకుల ముందుకు రానుంది. అలాగే ఈ అమ్మడి చేతిలో రెండుమూడు సినిమాలు కూడా ఉన్నాయి. తాజాగా అనన్య ఇచ్చిన ఓ ఇంటర్వ్యూలో తాను నటిని కావడానికి ప్రేరేపించిన అంశాల గురించి ఆసక్తికరంగా చెప్పింది. 'చిన్నప్పట్నుంచి నటన అంటే పిచ్చి. అది ఏ స్థాయిలో ఉంటే, ఎదుటివారి దృష్టిని ఆకర్షించడానికి తరచుగా మా అన్నయ్య, చెల్లితో గొడవపడేదాన్ని. వాళ్లను కొట్టేదాన్ని కూడా. కానీ నాది నటన అని వాళ్లకు తెలిసిపోతుండేది. చివరకు నిజంగా కొట్టుకున్నా నటనే అనుకునేవారు. ఆ నటనే నన్ను బాలీవుడ్‌వైపు నడిపించింది. ఒకరిని ఇమిటేట్ చేయడం అన్నా, అందర్నీ కూర్చోబెట్టి కథలు చెప్పడం అన్నా నాకిష్టం.' అని చెప్పుకొచ్చింది అనన్యపాండే.

వర్షంలో తడిసినట్లే అనిపిస్తుంది

అగ్ర నటుడు ఎన్టీఆర్ బావమరిది నార్నే నితిన్ హీరోగా నటిస్తున్న చిత్రం 'ఆయ్'. అంజి కే మణిపుత్ర దర్శకుడిగా పరిచయమవుతున్నాడు. బన్నీవాస్, విద్యా కొప్పినీడి నిర్మాతలు. ఈ చిత్ర థీమ్‌సాంగ్‌ను శుక్రవారం అగ్ర నిర్మాత అల్లు అరవింద్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 'తూర్పు గోదావరి జిల్లాలో వర్షం నేపథ్యంలో సినిమా తీస్తామని హీరో నితిన్ నాతో చెప్పారు. వర్షం కోసమే చాలా ఖర్చు పెట్టారు. సినిమా చూస్తే నిజంగా మనం వర్షంలో తడుస్తున్నట్లే ఉంటుంది' అన్నారు. గోదావరి నేపథ్యంలో స్నేహం గురించి చెప్పే చిత్రమిదని నార్నే నితిన్ అన్నారు. ఈ కథ విని హాయిగా నవ్వుకున్నానని, ప్రేక్షకులు కూడా అదే విధంగా ఫీల్ అవుతారని బన్నీ వాసు చెప్పారు. ఇప్పటివరకు గోదావరి నేపథ్యంలో వచ్చిన చిత్రాల్లో ది బెస్ట్ అవుతుందని దర్శకుడు అంజి కె మణిపుత్ర తెలిపారు.

ఏజెంట్ జనార్దన్ సున్నిపెంట



హీరో నితిన్ నటిస్తున్న యాక్షన్ కామెడీ ఎంటర్‌టైనర్ 'రాబిన్‌హుడ్'. శ్రీలీల కథానాయిక. అగ్రనటుడు డా.రాజేంద్రప్రసాద్ ఇందులో కీలక పాత్ర పోషిస్తున్నారు. వెంకీ కుడుముల దర్శకత్వంలో మైత్రీ మూవీమేకర్స్ పతాకంపై నవీన్ యెర్నేని, వై.రవిశంకర్ ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నారు. ప్రస్తుతం ఈ సినిమా షూటింగ్ శరవేగంగా జరుగుతున్నది. డిసెంబర్ 20న క్రిస్మస్ కానుకగా సినిమాను విడుదల చేయనున్నారు. ఈ రోజు డా.రాజేంద్రప్రసాద్ పుట్టినరోజు. ఈ సందర్భంగా 'ఏజెంట్ జాన్ స్నో అకా జనార్దన్ సున్నిపెంట'గా ఆయన పాత్రను పరిచయం చేస్తూ, లుక్‌ని విడుదల చేసి, శుభాకాంక్షలు అందించారు. ఇందులో రాజేంద్రప్రసాద్ అద్భుతమైన వినోదాన్ని పంచనున్నారని, ఆయన గెటప్‌లాగే పాత్ర కూడా ఇంట్రస్టింగ్‌గా ఉంటుందని మేకర్స్ తెలిపారు. ఈ చిత్రానికి కెమెరా: సాయిశ్రీరామ్, సంగీతం: జి.వి.ప్రకాశ్‌కుమార్.

'డార్లింగ్'కు ఫ్యామిలీ ఆడియెన్స్ ఆదరణ

'థియేటర్లో ప్రేక్షకుల మధ్య కూర్చొని సినిమా చూశాను. కామెడీ, ఎమోషన్స్‌కు వారు బాగా కనెక్ట్ అవుతున్నారు. సినిమా చూస్తూ మా అమ్మగారు క్లాప్స్ కొట్టడం చాలా ఆనందంగా అనిపించింది' అన్నారు ప్రియదర్శి. ఆయన హీరోగా నటించిన తాజా చిత్రం 'డార్లింగ్' శుక్రవారం ప్రేక్షకుల ముందుకొచ్చింది. నభానటేష్ కథానాయికగా నటించిన ఈ చిత్రానికి అశ్విన్‌రామ్ దర్శకుడు. నిరంజన్ రెడ్డి, చైతన్య రెడ్డి నిర్మించారు. శుక్రవారం ఏర్పాటు చేసిన సక్సెస్‌మీట్‌లో ప్రియదర్శి మాట్లాడుతూ 'ఈ సినిమా ఫ్యామిలీ ఆడియెన్స్‌కు బాగా కనెక్ట్ అవుతున్నది. అన్ని కేంద్రాల్లో అద్భుతమైన స్పందన లభిస్తున్నది. అందరూ థియేటర్లలో సినిమాను ఎంజాయ్ చేయండి' అన్నారు. తాము ఊహించినట్లుగానే మహిళా ప్రేక్షకులు సినిమాను బాగా ఇష్టపడుతున్నారని, రాబోవు రోజుల్లో ఫ్యామిలీ ఆడియెన్స్ అందరూ సినిమాను ఆదరిస్తారనే నమ్మకం ఉందని దర్శకుడు అశ్విన్ రామ్ పేర్కొన్నారు. నభానటేష్ మట్లాడుతూ 'ఇదొక క్లీన్ ఫ్యామిలీ ఎంటర్‌టైనర్. ద్వితీయార్థంలోని కొన్ని సన్నివేశాలకు ప్రేక్షకులు ఎమోషనల్‌గా ఫీలవుతున్నారు. ఈ సినిమా మా అంచనాలను అందుకుంది' అని చెప్పింది. ఈ కార్యక్రమంలో చిత్ర యూనిట్ సభ్యులందరూ పాల్గొన్నారు.

Printed and Published by **Damodar Rao Divakonda**, on behalf of Telangana Publications Pvt Ltd, Printed at Telangana Publications Pvt. Ltd, S.No. 437, Near Velama Kalyana Mandapam, Devera Yanjaal, Shamirpet Mandal, Dist: Medchal - 500 078.
Published At Telangana Publications Pvt Ltd. 8-2-603/1/7,8,9. Krishnapuram, Road No.10, Banjara Hills, Hyderabad, 500 034, Telangana State. Editor: **Thigulla Krishna Murthy.** Ph: +91 40 2329 1999, Fax: +91 40 2333 4242, 040-23291118, Toll Free: 1800 425 3666. RNI No. TELTEL/2011/37693.